
సాక్షి
బాపట్ల
సోమవారం । 9 । జూన్ । 2025



శివాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

కొల్లిపర: శ్రీగంగాపార్వతి సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 511.80 అడుగుల వద్ద ఉంది. ఇది 134.7464 టీఎంసీలకు సమానం.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



పొన్నూరు: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. రుత్వికులు రమణ, రామశాస్త్రి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు.

న్యూస్‌రీల్

గుంటూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



లక్ష్మీపురం: రైళ్లలో గంజాయి, మద్యం అక్రమంగా సరఫరా చేస్తే చట్ట పరమైన చర్యలు తీవ్రతరంగా ఉంటాయని రైల్వే జీఆర్పీ సీఐ అంజిబాబు, ఆర్పీఎఫ్ సీఐ వీరాబాబు అన్నారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఆదివారం గుంటూరు రైల్వే డీఎస్పీ అక్కేశ్వరరావు ఆదేశాల మేరకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికుల సామగ్రిని డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీ చేశారు. ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గంజాయి, మద్యం అక్రమంగా సరఫరా చేసే వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైలులో ప్రయాణించే సమయంలో రైల్వే స్టేషన్‌లలో అనుమానితులు ఉన్నట్లు ఉంటే జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం తెలియజేయాలని కోరారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీలు చేసిన వారిలో జీఆర్పీ ఎస్‌ఐలు లక్ష్మీనారాయణరెడ్డి, మహిళా ఎస్‌ఐ దీపికా, జ్యోతి, ఆర్పీఎఫ్ సిబ్బంది శంకరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయం ఉద్యోగి సస్పెన్షన్

పెదకాకాని: శివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కొన్ని సంవత్సరాలుగా ఇల్లా ప్రదీప్‌కుమార్ ఎన్ఎంఆర్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. నాలుగు రోజుల కిందట మహిళా ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె ఆలయ అధికారికి ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం ప్రదీప్ కుమార్ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు నిర్ధారణ కావడంతో ఆదివారం అతడ్ని శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్లు డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

నిత్య అన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందచేశారు. హైదరాబాద్‌వాసి వి.బాలాజి అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన ఇ.ఏడుకొండలు కుటుంబం అమ్మవారి దర్శనానికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం వారికి ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

బాలాత్రిపురసుందరికి బంగారు ఆభరణాలు



కూచిపూడి(మొవ్వ): కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కేంద్రీయ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ పసుమర్తి రామలింగ శాస్త్రి, పద్మ దంపతులు (హైదరాబాద్-కూచిపూడి) నాట్యాచార్యుల ఇలవేల్పైన శ్రీ బాలాత్రిపురసుందరి అమ్మవారికి బంగారు ఆభరణాలను ఆదివారం అందజేశారు. దేవాలయ పాలకమండలి ఉపాధ్యక్షుడు పసుమర్తి నారాయణమూర్తి.. అర్చకులు పెనుమూడి సుబ్రహ్మణ్యశాస్త్రికి ఎనిమిది లక్షల రూపాయలు విలువైన రెండు హారాలను, శ్రీ దాసాంజనేయ స్వామికి రూ. 38 వేల విలువైన 108 వెండి తమలపాకుల మాలను అందజేశారు. ఈ సందర్భంగా హారాలను అమ్మవారికి అలంకరింపజేసి పూజా కార్యక్రమాలు చేశారు.



పర్చూరు మండలం వీరన్నపాలెంకు చెందిన ఉప్పుటూరు సాంబశివరావు ఎకరా రూ.40 వేలు చొప్పున 5 ఎకరాలు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేశారు. సుమారు రూ. 8 లక్షలు అప్పులు తెచ్చారు. పంట చేతికొచ్చి నెల దాటుతున్నా కొనేందుకు కంపెనీలు ముందుకు రాలేదు. పైగా క్వింటాల్ రూ. 5 వేల నుంచి రూ.10 వేలకు మించి వచ్చే పరిస్థితి లేదు. ఈ ధరతో పొగాకు అమ్మినా ఖర్చులు కూడా రావు. ఇప్పటికే రూ. 15 లక్షలకుపైగా ఉన్న అప్పులు తీర్చే పరిస్థితి కాన రాలేదు. నిస్సహాయ స్థితిలో సాంబశివరావు మే నెల 6 వ తేదీన ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య యశోద, ఇంటర్ చదివే కూతురు, పది చదివిన కుమారుడు దిక్కులేని వారయ్యారు. కుటుంబం రోడ్డున పడింది.



అద్దంకి నియోజకవర్గం జె.పంగులూరు మండలం జనకవరానికి చెందిన రైతు తల్లపనేని శ్రీనాథ్ అప్పుల బాధతో మే నెల 23వ తేదీ రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శ్రీనాథ్ కరోనా ముందువరకు బళ్లారిలో కౌలు వ్యవసాయం చేశారు. అక్కడ అప్పులు అధికమై సొంత గ్రామం జనకవరం వచ్చారు. పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. గత ఏడాది 7 ఎకరాల్లో నల్లబర్లీ, జూట్, శనగ సాగు చేశారు. మూడు పంటలను కొనేవారు లేకుండా పోయారు. రూ. 30 లక్షల వరకు అప్పులయ్యాయి. రుణాలు ఇచ్చిన వారి వేధింపులు తాళలేక తనకున్న 2.14 ఎకరాల భూమిని అమ్మేశారు. అయినా అప్పులు తీరే పరిస్థితి లేకపోవడంతో మే నెల 23వ తేదీ రాత్రి పొలానికి వెళ్లిన శ్రీనాథ్ అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన మరణంతో కుటుంబం రోడ్డున పడింది.



ఇంకొల్లు మండలం దుద్దుకూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన రైతు బిల్లా శాంసన్ 30 ఎకరాలకుపైగా కౌలుకు తీసుకొని బ్లాక్ బర్లీ, మిర్చి, శనగ పంటలు సాగు చేశారు. ఇందుకోసం బ్యాంకుల్లో బంగారం తాకట్టుపెట్టి కొంత, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద మరికొంత అప్పులు తెచ్చారు. ఈ సంవత్సరం పండించిన పంటలు కొనేవారు లేకుండా పోయారు. అప్పులు తీర్చలేనన్న ఆందోళనతో శాంసన్ మే నెల 9 వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమయానికి బంధువులు చూసి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

రైతుల పాలిట పాషాణ కూటమి

- కూటమి ప్రభుత్వం వచ్చాక పంటలకు మద్దతు ధర కరువు
- వరి పండినా గిట్టుబాటు ధరకు కొనని కూటమి సర్కారు
- మిర్చి, పొగాకు, శనగ, మినుము, కంది పంటలకూ అదే పరిస్థితి
- లాభాల మాట దేవుడెరుగు.. కనీసం పెట్టుబడి కూడా రాని దుస్థితి
- అప్పులు అధికమై బలవన్మరణాలకు పాల్పడుతున్న అన్నదాతలు
- పాలకులు స్పందించకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు

పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతుల వరుస ఆత్మహత్యలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పంటలకు గిట్టుబాటు ధర లభించడంతో రైతులకు ఇబ్బంది ఉండేది కాదు. కూటమి సర్కారు వచ్చాక అన్నదాతలకు కష్టాలు పెరిగాయి. అప్పులు చేసి పంటలు పండించినా ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చిన పాపాన పోలేదు. కొనే పరిస్థితి లేకుండా పోయింది. బయట మార్కెట్‌లో ధరలు ఉన్నాయా అంటే అదీ లేదు. దళారులకు తక్కువ ధరకే పంటలు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పెట్టుబడుల సంగతి దేవుడెరుగు ఖర్చులు కూడా రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. వాటి నుంచి బయటపడలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతులు ప్రాణాలు తీసుకుంటున్నా కూటమి పాలకులకు చీమకుట్టినట్లుగా కూడా లేదు. వారిని ఆదుకునే ప్రయత్నం చేయడం లేదు.

వరి పంటకూ దక్కని మద్దతు

ఈ ఏడాది జిల్లాలో దాదాపు 3 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 6.50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వచ్చిందని అంచనా. ఇందులో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధరకు కొనలేదు. దీంతో రైతులు బస్తా ధాన్యం రూ. 1300 లోపే దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోయారు.

మిర్చి రైతులకూ మిగిలింది కన్నీరే

ఇక నగరం, సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, జె.పంగులూరు, అద్దంకి, కొరిశపాడు మండలాల్లో 9,330 ఎకరాల్లో రైతులు మిర్చి పంట సాగు చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో



క్వింటా మిర్చి రూ. 22 వేల వరకు ధర పలికింది. ఎకరాకు 20 కింటాళ్ల దిగుబడి వచ్చింది. దీంతో రైతులు లాభాలు చూశారు. ఈ ఏడాది ఎకరాకు 5 నుంచి 10 క్వింటాళ్లలోపే దిగుబడులు రాగా రూ. 8 వేల నుంచి 10 వేల లోపు మాత్రమే ధర ఉంది. ఈ ధరతో రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేక అప్పులు మిగిలాయి.

పొగాకుకూ అదే దుస్థితి..

జిల్లాలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలలో 64,165 ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేశారు. దాదాపు 53 వేల ఎకరాల్లో బ్లాక్ బర్లీ సాగైంది. గత ప్రభుత్వంలో క్వింటా పొగాకు రూ. 25 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలికింది. పెట్టుబడి పోను రైతులకు మంచి లాభాలు వచ్చాయి. ఈ సంవత్సరం రూ. 5 వేల నుంచి రూ.10 వేల లోపే ధర ఉంది. ఎకరా సాగుకు రూ. 1.60 లక్షల వరకు రైతులు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం ఉన్న ధరతో కూలీల ఖర్చులు కూడా రావని వాపోతున్నారు. భారీ విస్తీర్ణంలో పొగాకు సాగు చేసిన రైతులు పెట్టుబడులు అధికమై అప్పుల నుంచి బయటపడలేక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి నెలకొంది. ఇవి కాకుండా



ఊసే లేని పెట్టుబడి సాయం

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రైతులకు పెట్టుబడి సాయం కోసం రైతు భరోసా సకాలంలో నిరాటంకంగా ఇచ్చారు. ఆ స్థానంలో అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు సహా కూటమి నేతలు ఆర్భాటంగా ప్రకటించారు. గద్దెనెక్కి ఏడాది దాటుతున్నా ఇప్పటికీ రైతులకు ఈ పథకం కింద పైసా ఇవ్వలేదు. గత ప్రభుత్వ పాలనలో జిల్లాలో 1,92,039 మంది రైతులకు రూ . 13,500 చొప్పున సాయం అందించారు. కూటమి నేతలు చెప్పిన హామీ ప్రకారం రైతుకు రూ. 20 వేల చొప్పున జిల్లాలో ఏటా రూ. 385 కోట్లు ఇవ్వాల్సి ఉంది. చంద్రబాబు పాలనలో రెండో ఖరీఫ్ సీజన్ మొదలవుతున్నా ఇప్పటికీ అన్నదాత సుఖీభవ ఇవ్వక రైతులను వంచించారు.

రైతులు పండించిన కంది, మినుము, శనగ, పెసర తదితర పంటలకు గిట్టుబాటు ధర లేదు. పేరుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొంటామని ప్రభుత్వం చెబుతున్నా మొక్కుబడిగా కూడా కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నమ్మించి నయవంచన

- మాన్యువల్ కౌన్సెలింగ్‌పై మాట తప్పిన విద్యాశాఖామంత్రి లోకేష్
- వెబ్ కౌన్సెలింగ్ వద్దు.. ఉపాధ్యాయులతో పెట్టుకుంటే ప్రభుత్వాన్నే మార్చేస్తాం
- ఉపాధ్యాయుల ముట్టడితో దద్దరిల్లిన ప్రకాశం భవన్
- వందలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయులు
- రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: ఎస్జీటీ, పండిట్లు, పీఈటీల బదిలీలను మాన్యువల్ విధానంలో నిర్వహిస్తామని మాట ఇచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నమ్మించి మోసం చేశారని, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. వెబ్ కౌన్సెలింగ్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఆదివారం ప్రకాశం జిల్లా డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉపాధ్యాయులు కలెక్టరేట్ లోపలికి వెళ్లకుండా గేట్లు వేశారు. ఉపాధ్యాయులను లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి అధ్యక్షత వహించారు. కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పెట్టుకుంటే ప్రభుత్వాన్నే మార్చేస్తామని హెచ్చరించారు. ఇది చరిత్రలో రుజువైన సత్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులందరూ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 13,777 ఎస్జీటీలకుగాను 177 మంది మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారు కూడా అధికారుల ఒత్తిడి వల్లే దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ప్రభుత్వం అత్యంత హేయంగా ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతో విద్యాశాఖామంత్రి నారా లోకేష్ జరిపిన చర్చల్లో ఎస్జీటీలకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని మాట ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నమ్మించి మాట తప్పిన ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులకు ఎప్పటికీ మాన్యువల్ కౌన్సెలింగే కావాలని, వెబ్ కౌన్సెలింగ్ వద్దని తేల్చి చెప్పారు. అయితే మాన్యువల్ కౌన్సెలింగ్ సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారని, జిల్లా స్థాయిలో డీఈఓ, ఎంఈఓలకు వెబ్ కౌన్సెలింగ్కు సంబంధించిన ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్జేడీ చెబుతున్నారని తెలిపారు. ఒక్కొక్కరూ ఎన్ని ఆప్షన్లు అయినా పెట్టుకోవచ్చని నమ్మబలుకుతున్నారని, దీనిని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు ఎవరూ వెబ్ ఆప్షన్ పెట్టుకోవద్దని సూచించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎస్జీటీ, పీఈటీ, పండిట్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని సీనియారిటీ జాబితాలో ఉన్న లోపాలను సరిచేసి ఫైనల్ జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రతినిధి చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ వల్ల ఉపాధ్యాయులకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపీయూఎస్ రాష్ట్ర ప్రతినిధి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నాయకులతో చర్చించాలని కోరారు. ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.కీర్తి మాట్లాడుతూ ఉద్యమం బలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. బీటీఏ రాష్ట్ర ప్రతినిధి పర్రె వెంకటరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల సమస్య పరిష్కారం కోసం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు షేక్ అబ్దుల్ హై, వీరాంజనేయులు, రవి, కె.ఎర్రయ్య, బి.వెంకటరావు, లక్ష్మీనారాయణ, డి.శ్రీనివాసులు, దిలీప్‌కుమార్, మాధవరావు, వై.వెంకటరావు, హిమజ, పులి శ్రీను, ఎస్. అంజిరెడ్డి, పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం డీఈఓ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కష్టాలు



వెబ్ కౌన్సెలింగ్ పేరుతో ప్రభుత్వం ఉపాధ్యాయుల మీద తీవ్రమైన ఒత్తిడికి గురి చేయడం సమర్థనీయం కాదు. నాలుగు రోజులు ఆలస్యమైనా మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు నిర్వహించడం మంచిది. దీని వల్ల ఎనిమిది సంవత్సరాలపాటు ఎలాంటి సమస్య లేకుండా ఉపాధ్యాయుడు విధులు నిర్వహించగలడు. ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం విచారకరం.

– షేక్ అబ్దుల్ హై, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

మూడు వేల ఆప్షన్స్ ఎప్పుడు పెట్టాలి



రాష్ట్రంలో ప్రతి జిల్లాలోను కనీసం మూడువేల మంది ఎస్జీటీలు ఉన్నారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఒక్కొక్క ఉపాధ్యాయుడు మూడువేల ఆప్షన్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇది ఎలా సాధ్యం . ప్రభుత్వ విధానం సవ్యంగా లేదు. బదిలీల చట్టాన్ని సవరణ చేసి మాన్యువల్ విధానంలోనే బదిలీలు చేపట్టాలి. ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించి విద్యాశాఖామంత్రి నారా లోకేష్ మాట నిలబెట్టుకోవాలి.

– వాకా జనార్దనరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయులను గందరగోళంలోకి నెట్టొద్దు..



రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోంది. ఉత్తర్వుల్లో ఒక రకంగాను, అమలులో మరొక రకంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను గందరగోళంలోకి నెట్టేస్తున్నారు. పదోన్నతుల విషయంలో కూడా వెబ్ కౌన్సెలింగ్ విఫలమైంది. చివరికి మాన్యువల్ గానే పదోన్నతులు కానిచ్చారు. వెబ్ కౌన్సెలింగ్ వల్ల ఉపాధ్యాయులు నరకం అనుభవిస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. – పి.వి.సుబ్బారావు, ఏపీటీఎఫ్ కౌన్సిలర్

ఉపాధ్యాయులను వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వం



రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వల్లనే ఉపాధ్యాయులు రోడ్డెక్కాల్సి వచ్చింది. ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ప్రభుత్వం ఒక రకంగా స్పందిస్తుంది. అధికారులకు మరో రకంగా ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది. వేలాది మంది ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్ వద్దని డిమాండ్ చేస్తున్నారు. మాన్యువల్ విధానంలో బదిలీలు నిర్వహించమని కోరుతున్నారు.

– కె.ఎర్రయ్య, ఎస్టీయూ నాయకుడు

ఏపీ ఈఏపీసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



తెలగతోటి విక్రమ్ లేవీ (ఇంజినీరింగ్ ఆరో ర్యాంకు)

గుంటూరు ఎడ్యుకేషన్: కాకినాడ జేఎన్‌టీయూ ఆదివారం ప్రకటించిన ఏపీ ఈఏపీసెట్-2025 ఫలితాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. గత నెల 18 నుంచి 27వ తేదీ వరకు జరిగిన ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్) ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో గుంటూరు నగరానికి చెందిన తెలగతోటి విక్రమ్ లేవీ 6వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. గుంటూరులోని భాష్యం ఐఐటీ-జేఈఈ అకాడమీలో చదివిన విక్రమ్ లేవీ టెన్త్, ఇంటర్మీడియెట్ స్థానికంగానే చదివాడు. విద్యార్థి తండ్రి పిచ్చయ్య విజ్ఞాన్ యూనివర్సిటీలో సీఎస్ఈ విభాగ ప్రొఫెసర్ కాగా.. తల్లి ఇవాంజిలిన్ విజయవాడలోని మేరీ స్టెల్లా కళాశాలలో అధ్యాపకురాలు. విక్రమ్ లేవీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌ను ఎంపిక చేసుకున్నాడు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరీలో 146వ ర్యాంకు కైవసం చేసుకున్న విక్రమ్ లేవీ ముంబై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో చేరేందుకు ఆప్షన్ నమోదు చేసుకున్నాడు. స్టార్టప్ కంపెనీ ప్రారంభించడమే లక్ష్యం అని కోరిక వెలిబుచ్చాడు.

ఇంజినీరింగ్ టాప్–100లోపు ర్యాంకర్లు వీరే

గుంటూరులోని వేంకటేశ్వరకాలనీకి చెందిన అంబటి నోషిక్ సాయి 25వ ర్యాంకు, నరసరావుపేట విద్యార్థి కల్లూరి శ్రీరాఘవ – 46, గుంటూరు ముత్యాలరెడ్డి నగర్‌కు చెందిన విన్నకోట మహేష్ చంద్ర – 56, తెనాలికి చెందిన నల్లా శాన్వి సాయి వీర – 67, తాడేపల్లికి చెందిన గుమ్మడిదల హేమంత్ సాయిరామ్ – 76, గుంటూరుకు చెందిన గుత్తికొండ సాయి మనోజ్ఞ – 98, చందులూరి నాగవెంకట నీరజ్ – 99, గుంటూరు రూరల్ గోర్లవారిపాలెంకు చెందిన నల్లపనేని సుజిత్ 100వ ర్యాంకు సాధించారు.

అగ్రికల్చర్, ఫార్మసీలో...

అగ్రికల్చర్, ఫార్మసీ టాప్–100 ర్యాంకర్లలో గుంటూరు కొత్తపేటకు చెందిన పసుపులేటి రుద్ర శ్రీ గణేష్ 15వ ర్యాంకు, సత్తెనపల్లికి చెందిన కటకం ఏకేఎన్ హరి కిరణ్ –16, గుంటూరు కొరిటెపాడుకు చెందిన ఉమా శంకర్ తారిక శ్రీ – 28, అమరావతి రోడ్డుకు చెందిన కారుమంచి విక్రాంత్ –32, గుజ్జనగుండ్లకు చెందిన ఉప్పాల రూపశ్రీ – 40, కొలకలూరుకు చెందిన గుమ్మడిదల తేజాస్ – 54, చంద్రమౌళీనగర్‌కు చెందిన వేముల అన్విత్ చేతన్ – 67, శ్రీనగర్‌కు చెందిన ఓగిబెయిన సుష్మ కౌస్తుభరాణి – 96, పొన్నూరుకు చెందిన కూరాకుల శ్రీరామ్ యాదవ్ – 97, గుంటూరు విజయపురికాలనీకి చెందిన గుంటుపల్లి శ్రీలేఖ 110వ ర్యాంకు సాధించారు.

క్లుప్తంగా

బాపట్ల క్రీడాకారులకు బహుమతులు



బాపట్ల: రాష్ట్రస్థాయి 12వ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బాపట్లకు చెందిన క్రీడాకారులకు బహుతులు దక్కాయి. మే 31 నుంచి జూన్ రెండో తేదీ వరకు జరిగిన పోటీల్లో 74 కేజీల విభాగంలో షేక్ నజీర్ 260కేజీల బరువును ఎత్తి ద్వితీయ స్థానంతో సిల్వర్ మెడల్ సాధించారు. 65కేజీల విభాగంలో బత్తుల సాంబశివరావు 265కేజీల బరువును ఎత్తి సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నారు. ఇద్దరూ కర్ణాటకలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బాపట్లలో పలువురు క్రీడాకారులను అభినందించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పట్నంబజారు: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌత్రా సెంటర్లో నివాసం ఉండే కొనగండ్ల మోహన వెంకటకృష్ణ (56) ఈనెల 7వ తేదీ సాయంత్రం ఇంటి ముందు ఉన్న పిచ్చి మొక్కలు తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



నకరికల్లు: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నకరికల్లులోని ఇనిమెట్ల రోడ్డులో ఆదివారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన చందా మీరావలి(38) నకరికల్లులోని ఇనిమెట్ల రోడ్డులో గల మద్యం దుకాణం వద్ద అనుమానాస్పద స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ చల్లా సురేష్, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు కొన్ని రోజులుగా మద్యం మత్తులో తిరుగుతున్నాడని, ఆదివారం కూడా తాగేందుకు నకరికల్లు వచ్చినట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

ప్రహరీ కూలి మహిళ దుర్మరణం

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ప్రమాదానికి కారణమైన కూలిన ప్రహరీ



రోజ్‌మేరీ మృతదేహం



ప్రాణాపాయం నుంచి బయటపడిన ఆనందరావు

చీరాల రూరల్: ప్రహరీ కూలి మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం చీరాల మరియమ్మపేటలో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. ఆంధ్ర ఆనందరావు, రోజ్‌మేరీ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఆదివారం సుమారు 11:30 గంటల సమయంలో మేళం హనుమంతరావు తన ఇంటికి మరమ్మతులు చేయిస్తున్నాడు. పక్కనే నివాసముంటున్న ఆంధ్ర ఆనందరావు, రోజ్‌మేరీలు ప్రహరీ పక్కన ఉన్న తమ సామాన్లు సర్దుకుంటున్నారు. ఇంతలోనే పక్కనే ఉన్న ప్రహరీ అకస్మాత్తుగా భారీ శబ్దంతో కూలిపోయింది. పక్కనే ఉన్న రోజ్‌మేరీ గోడకింద పడటంతో మృతి చెందింది. ఆమె భర్త ఆనందరావుకు తల పగిలి, కాలుకు గాయాలయ్యాయి. స్థానికులు శిథిలాలను తొలగించి ఇద్దరినీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోజ్‌మేరీ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి భర్త ఆనందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగభూషణం తెలిపారు. రోజ్ మేరీ మృతితో మరియమ్మపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో ఎంతో కలివిడిగా ఉండే ఆమె మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భారీ రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆదివారం రికార్డు స్థాయిలో దర్శనాలు



క్యూలైన్‌లో దర్శనానికి వస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల సన్నిధికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పెద్దఎత్తున తరలివచ్చి ఆది దంపతులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. తెల్లవారుజాము ఆరు గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు ఆలయంలోని అన్ని క్యూలైన్లలో రద్దీ కనిపించింది. ఆదిదంపతులైన దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం 10–30 గంటల నుంచి అంతరాలయ దర్శనాలను నిలిపివేశారు. భక్తులు ఇబ్బంది పడకుండా రూ. 500 టికెట్ల విక్రయాలను నిలిపివేసి, రూ.300 టికెట్ల ద్వారా బంగారు వాకిలి దర్శనం కల్పించారు. మరో వైపున రూ.100, సర్వదర్శనం క్యూలైన్లలోనూ భక్తుల రద్దీ కనిపించింది. సర్వదర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. ఉదయం 11–30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వీఐపీ దర్శనాలు నిలిపివేశారు.

అమ్మవారి సన్నిధిలో సూర్యోపాసన సేవ

లోక కళ్యాణార్థం సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ భక్తులు సూర్యభగవానుడికి విశేష పూజలు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది. సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు రూ. 300 క్యూలైన్ ద్వారా ప్రత్యేక దర్శనం కల్పించారు.

ఆలయ సిబ్బందిపై భక్తుడి దాడి

గాలిగోపురం వద్ద ఉన్న స్కానింగ్ పాయింట్ వద్ద ఓ భక్తుడు ఆలయ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. భక్తుల రద్దీ నేపథ్యంలో దేవస్థానం రూ. 500 టికెట్లు, వీఐపీ దర్శనాలు నిలిపివేసింది. అయితే, ఓ భక్తుడు ఘాట్‌రోడ్డు మీదుగా ఆలయానికి చేరుకునే సమయంలో రూ. 500 టికెట్లు కావాలని అడిగాడు. అయితే ఈవో ఆదేశాల మేరకు మధ్యాహ్నం 1–30 గంట వరకు వీఐపీ దర్శనాలు నిలిపి వేసినట్లు సిబ్బంది సమాధానమిచ్చారు. దీంతో గాలిగోపురం వద్దకు చేరుకున్న భక్తుడు అక్కడి సెక్యూరిటీ గార్డుతో గొడవకు దిగడమే కాకుండా ఆలయ అధికారులు, సిబ్బందిని నోటికి వచ్చినట్లు దూషించసాగాడు. ఇదేమిటని అడిగిన వన్‌టౌన్ కానిస్టేబుల్‌ను సైతం నెట్టి వేయడంతో వివాదం మరింత పెరిగింది. దీంతో కోపంతో ఊగిపోయిన సదరు భక్తుడు సెక్యూరిటీ గార్డు, ఆలయ సిబ్బందిపై దాడి చేయడంతో వారు వెంటనే అతన్ని అవుట్ పోస్ట్‌కు తరలించారు. సెక్యూరిటీ గార్డు ఫిర్యాదు మేరకు సదరు భక్తుడిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: మద్యానికి బానిసై భార్య మందలించిందని మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నల్లచెరువు 20 లైన్‌లో నివాసం ఉండే షేక్ రన్ను హుస్సేన్ (38) గ్యాస్ కటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై నిత్యం తాగుతున్న క్రమంలో భార్య మస్తాన్‌బీ మందలించింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని హుస్సేన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డీముక్కల వీఆర్ఓపై లైంగిక దాడి కేసు

పొన్నూరు: మండలంలోని వడ్డీముక్కల గ్రామ వీఆర్‌ఓపై లైంగికదాడి కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీహరి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిడుబ్రోలు ప్రాంతానికి చెందిన ఓ మహిళ వడ్డీముక్కల గ్రామ రెవెన్యూ అధికారి రుద్రపాటి మహేష్‌కు రూ. 25 లక్షలు అప్పుగా ఇచ్చింది. అయితే తనవద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమని మహేష్‌ను అడగ్గా, ఇస్తానని చెప్పి ఒక చోటికి పిలిచి వీఆర్‌ఓ రుద్రపాటి మహేష్ తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయంలో మరో ఐదుగురు తనను దుర్భాషలాడారని పేర్కొంటూ తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు లైంగిక దాడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికతో యువకుడు అసభ్యప్రవర్తన

వినుకొండ: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడికి ఆమె కుటుంబసభ్యులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన వినుకొండ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఆదివారం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికతో యువకుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. అప్పుడే ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు గుర్తించి యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా నటుడు గిరిబాబు జన్మదిన వేడుకలు



మాట్లాడుతున్న రఘుబాబు

మేదరమెట్ల: ప్రముఖ సినీ నటుడు యర్రా గిరిబాబు 83వ జన్మదిన వేడుకలను ఆయన స్వగ్రామం రావినూతలలో కుమారుడు, ప్రముఖ సినీనటుడు రఘుబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రఘుబాబు మాట్లాడుతూ సొంత గ్రామం అంటే తన తండ్రికి ఎంతో ఇష్టం అని చెప్పారు. గ్రామంలో చిన్న కార్యక్రమం చేస్తున్నా ఆయన తప్పక హాజరయ్యేవారని తెలిపారు. ప్రస్తుతం అనారోగ్య కారణాలవల్ల రాలేక పోయారని.. ఈనెలలో గ్రామానికి తప్పక వస్తారని రఘుబాబు తెలిపారు. పలువురు మాట్లాడుతూ మరెన్నో పుట్టిన రోజు వేడుకలను గిరిబాబు జరుపుకోవాలని ఆకాంక్షించారు. పుట్టిన రోజు కేక్‌ను రఘుబాబు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో డాక్టర్ హృదయనాథ్, సీఐ మల్లికార్జునరావు, కొరిశపాడు ఎస్ఐ సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ

- కుటుంబ సభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న అధికారులు
- రైతు తల్లపనేని శ్రీనాథ్ మృతికి గల కారణాలపై ఆరా
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు



రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీఎస్పీ, ఆర్డీఓ

జె.పంగులూరు: అప్పుల పాలై గత నెల 24న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న యువ రైతు తల్లపనేని శ్రీనాథ్ కుటుంబాన్ని ఆదివారం డీఎస్పీ మహ్మద్ మొయిన్, ఆర్‌డీఓ చంద్రశేఖర్ నాయుడు పరామర్శించారు. మృతికి గల కారణాలు అధికారులను, స్థానికుల నుంచి తెలుసుకున్నారు. గత సంవత్సరం 2.10 ఎకరాల పొగాకు, 2.50 ఎకరాల మిర్చి, 4.80 ఎకరాల మొక్కజొన్న సాగు చేసినట్లు తెలిపారు. పంటలు సరిగా పండక, దిగుబడులు రాక రూ. 18,68,437 వరకు శ్రీనాథ్ అప్పుల పాలైనట్లు చెప్పారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.6.50 లక్షలు, బ్యాంకుల నుంచి రూ. 11 లక్షలు అప్పులు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్‌డీఓ చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ గ్రామంలో ఇంటి స్థలం, ఇల్లు కట్టుకునేందుకు రుణాన్ని మంజూరు చేయించాల్సిందిగా అధికారులకు సూచించారు. వివరాలు ప్రభుత్వానికి పంపించి న్యాయం జరిగే విధంగా చూస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, ఎస్ఐ వినోద్ బాబు, ఏఓ సుబ్బారెడ్డి, ఆర్ఐ శ్వేత, వీఆర్‌ఓలు పావని, చింపారావు పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ
- అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న పొగాకు కౌలు రైతు మృతదేహానికి నివాళి



రైతు శివశంకర వరప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

లక్ష్మీపురం: పొగాకు పండించి కొనేవారు లేక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు శివశంకర్ వరప్రసాద్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, వారి కుటుంబానికి నివాస స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఏ ఆధారం లేని ఆ కుటుంబానికి స్వయం ఉపాధి కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరు జీజీహెచ్ మార్చురీ వద్ద మృతుడు శివశంకర్ వరప్రసాద్ కుటుంబాన్ని నేతాజీ, జిల్లా కమిటీ సభ్యులు వై.కృష్ణకాంత్‌లు కలిసి పరామర్శించి ఆత్మహత్యకుగల కారణాలు అడిగి తెలుసుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో పంట మీద వచ్చిన ఆదాయంతో స్థలం కొనుక్కుని ఇల్లు నిర్మాణం చేసుకోవాలని కౌలు రైతు శివశంకర్ అనుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎకరానికి రూ.20వేలు కౌలు చొప్పున 11 ఎకరాలు కౌలుకి తీసుకుని పొగాకు పంట వేశారన్నారు. బ్యాంకులు అప్పు ఇవ్వకపోవడంతో ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకుని పంట వేశారన్నారు. పండించిన పొగాకు కొనేవారు లేక అప్పులు తీర్చే పరిస్థితి కనబడకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతు అత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించి వారి కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబంలో ఒకరికి స్వయం ఉపాధికి అవకాశం కల్పించాలని, నివాసం కోసం స్థలం కేటాయించి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రూ.10లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి : కౌలు రైతు సంఘం డిమాండ్

అప్పుల బాధ తాళలేక, గిట్టుబాటు ధరలేక ప్రత్తిపాడు మండలం పెద్ద గొట్టిపాడు చెందిన పొగాకు కౌలు రైతు కావూరి శివశంకర వరప్రసాద్ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని ప్రభుత్వం స్పందించి వారి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రామకృష్ణ, కె.నాగమల్లేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావులు ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే పొగాకు కొనుగోలు చేయాలని, ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన కౌలు రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మెకానిక్ ముసుగులో ద్విచక్ర వాహనాలు చోరీ

- బైక్ చోరీల కేసులో ఇద్దరు అరెస్టు
- 22 వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ భానోదయ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భానోదయ

గుంటూరు రూరల్: చెడు వ్యసనాలకు బానిసలై సులువుగా డబ్బు సంపాదించేదుకు చోరీలను పాల్పడుతున్న ఇరువురిని నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం అడవి తక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ తెలిపిన వివరాల ప్రకారం గోరంట్ల గ్రామానికి చెందిన పరిమిశెట్టి లక్ష్మణ్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతనికి పాతగుంటూరుకు చెందిన పాత నేరస్తుడు బైక్ మెకానిక్‌గా పనిచేసే చల్లా అంజిబాబు పరిచయమయ్యాడు. దీంతో ఇరువురు కలిసి సులువుగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాలను చోరీ చేయడం ప్రారంభించారు. ఇరువురు పాత నేరస్తులే.. గుట్టు చప్పుడు కాకుండా ఆసుపత్రులు, పార్కులు, ఇతర రద్దీగా ఉండే ప్రదేశాల్లో పార్కింగ్ చేసే వాహనాలను, తాళాలు వేయని వాహనాలను గుర్తించి చోరీలకు పాల్పడేవారు. ఈక్రమంలో ఈనెల 1వ తేదీన గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డులోని విజయశ్రీ ఆసుపత్రి సమీపంలో రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఇరువురు చోరీ చేశారు. బాధితుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు నల్లపాడు సీఐ వంశీధర్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను ఆదవారం నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా నిందితులు చేసిన నేరాలను ఒప్పుకున్నారు. నిందితులు 2012 నుంచి నేర ప్రవృత్తిని కలిగి ఉన్నారని విచారణలో తేలిందన్నారు. నిందితుల వద్దనుంచి రూ.13లక్షల విలువ చేసే 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు ఛేదించటంలో ప్రతిభ కనబరిచిన సీఐ, ఎస్ఐ జనార్దన్, సిబ్బంది సుబ్బారావు, మస్తాన్‌వలి, నూరుల్ల, బిక్షునాయక్, సాంబశివరావులను జిల్లా ఎస్పీ అభినందించారు. నిందితులను కోర్టుకు అప్పగించారు.

తాడేపల్లిలో రామ్‌రాజ్ షోరూం ప్రారంభం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఆదివారం రామ్‌రాజ్ కాటన్ షోరూంను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వహిందూ పరిషత్ జాతీయ ధర్మకర్త, పారిశ్రామికవేత్త డాక్టర్ పుట్టగుంట వెంకట సతీష్‌కుమార్ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని గుర్తు చేస్తూ రామ్‌రాజ్ కాటన్ దుస్తులు ఉత్పత్తి చేయడం చాలా ఆనందించదగ్గ విషయమని, నాణ్యతా ప్రమాణాల్లో ఎంతో శ్రద్ధ తీసుకుంటుందని, మన తాడేపల్లిలో ఇలాంటి షోరూం ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్), శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం మాజీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.ఎస్.రామారావు, బక్షి మోటార్స్ ల్యాండ్ లార్డ్ సత్ప్రీత్ సింగ్ లాంబా, రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకులు కె.ఆర్.నాగరాజన్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : వ్యక్తి మృతి

ముగ్గురికి గాయాలు



మృతి చెందిన వీరాంజనేయులు

దుగ్గిరాల: ఎదురెదురుగా వస్తున్న ద్వి చక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదివారం చిలువూరు దగ్గర సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమర్తలూరు మండలం, ప్యాపర్రు గ్రామానికి చెందిన కొల్లూరి వీరాంజనేయులు(35) గుంటూరులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. గుంటూరు వెళ్లి తిరిగి వస్తుండగా దుగ్గిరాల మండలం చిలువూరు వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ఘటనలో వీరాంజనేయులు తలకు తీవ్ర గాయమై, రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై తీవ్రంగా గాయపడిన రాయపూడి డేవిడ్‌ను చికిత్స నిమిత్తం ఎయిమ్స్‌కు, మరో ఇద్దరు క్షతగాత్రులను విజయవాడ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్‌కి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

శ్రష్టి వర్మపై 'మా' అధ్యక్షుడికి ఫిర్యాదు



లక్ష్మీపురం: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసిన దేశ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ అధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. గుంటూరు నగరంలోని శనివారం జరిగిన కన్నప్ప ప్రీ రిలీజ్ కార్యక్రమానికి శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరానికి విచ్చేసిన మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణును కలిసిన కరీం ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ సినీ కొరియోగ్రాఫర్‌గా ఉన్న శ్రష్టి వర్మ జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూలను కించపరుస్తూ మాట్లాడారన్నారు. స్టార్ హీరోలను సైతం కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న ఆయన పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంచు విష్ణు విచారించి, ఏడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

ప్రపంచ శాంతే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి

- ఘనంగా ప్రపంచ ప్రార్థన దినోత్సవం
- నియోజకవర్గ దైవసేవకుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన
- గత 50 రోజులుగా ఉదయకాల ప్రార్థనలు



ప్రపంచ ప్రార్థన దినోత్సవ ప్రార్థనల్లో దైవసేవకులు

చిలకలూరిపేట టౌన్: ప్రపంచ ప్రార్థనల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో భక్తి శోభ అలముకున్నది. ప్రతిరోజూ ఉదయాన్నే గత 49 రోజులుగా నిరంతరాయంగా ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం 50వ రోజుతో ఘనమైన ముగింపు పలికారు. ప్రత్యేక ప్రార్థనలతో ప్రపంచ ప్రార్థనల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు పాస్టర్ ఎంఎస్ మూర్తి (సూరిబాబు) అధ్యక్షతన జరిగిన ఈ ప్రార్థనల్లో నియోజకవర్గానికి చెందిన వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విశ్వశాంతి నెలకొనాలని, భారతదేశం ఐక్యంగా వర్ధిల్లాలని, శాంతి, భద్రతల వాతావరణం నిరంతరం కొనసాగాలని వారు ప్రార్థించారు. దేశాభివృద్ధికి మానవీయ విలువలు అనుసరణీయమవ్వాలన్న ఆకాంక్షను ప్రార్థనల ద్వారా వెలిబుచ్చారు. ప్రార్థనలు ముగిశాక సంఘీభావానికి ప్రతీకగా ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ప్రార్థనల్లో పాస్టర్లు ఎం.ఎస్. మూర్తి, ఎస్.థామస్, జి. బుజ్జి, బసికాపురం అబ్రహం, టి. క్రీస్తురాజు, ఎం. మోషే, ఎన్. అబ్రహం, బి. సుబ్బారావు, డి. జీవరత్నం, ఎన్. వసురాజు, పాల్‌సారథి, ఎస్. డేవిడ్, ఎస్. దావీదురాజు, విజయమేరీ నక్షత్రం, ఎం. జ్ఞానయ్య, సతీష్ కుమార్, ఎం. సంసోను, కె. శాంతిసాగర్, కోటి వీరయ్య, అన్నామణి, శారా, విజయ అనసూయ తదితరులు పాల్గొన్నారు.